
ఈనాడు
నారాయణపేట
బుధవారం అక్టోబరు 2, 2024

వక్ఫ్ భూముల పరిరక్షణపై దృష్టేదీ..!



పాలమూరులో ఏడు వేల ఎకరాల్లో ఆక్రమణలు

మహబూబ్‌నగర్‌లో ఓ ప్రాంతంలో వక్ఫ్‌భూములు అంటూ ఏర్పాటు చేసిన బోర్డు

ఈనాడు, మహబూబ్ నగర్: పాలమూరులో వక్ఫ్ భూముల ఆక్రమణలకు అడ్డుకట్ట పడటంలేదు. పూర్వ మహబూబ్‌నగర్‌లో 4,561 సంస్థలకు 11,500.18 ఎకరాల్లో వక్ఫ్ భూములున్నాయి. వీటిలో సుమారు ఏడు వేల ఎకరాలకు పైగా భూములు అన్యాక్రాంతమైనట్లు గతంలోనే వక్ఫ్ బోర్డు గుర్తించింది. ఉమ్మడి జిల్లాలో 1,592 చిల్లాలు, 1,523 అసూర్‌ఖానాలు, 766 ఖబర్‌స్థాన్‌లు, 297 మజీదులు, 223 దర్గాలు, 160 ఇతర సంస్థలకు ఈ భూముల కేటాయింపులు జరిగాయి. ప్రస్తుతం వీటిలో సగానికిపైగా భూములు వివిధ ప్రాంతాల్లో కబ్జాల్లో ఉన్నాయి. వీటి పరిరక్షణలో వక్ఫ్ బోర్డు ఉదాసీనత ప్రదర్శిస్తుండటంతో ఈ స్థలాల్లో స్థిరాస్తి వ్యాపారాలు, ఇతర నిర్మాణాలు జరుగుతున్నాయి. పెద్ద భవంతులను నిర్మిస్తున్నారు. నిబంధనల ప్రకారం వక్ఫ్ భూముల క్రయవిక్రయాలు చేయకూడదు. ఉమ్మడి జిల్లాలో ఇవేవీ అమలు కావడం లేదు. తరచూ ఏదో ఒక ప్రాంతంలో ఈ భూములపై వివాదాలు నెలకొంటున్నాయి.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లాలో వక్ఫ్ భూములు పలు ప్రాంతాల్లో ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ముఖ్య ప్రజాప్రతినిధులు, స్థానిక నేతల సహకారంతో పలుచోట్ల ఈ భూములను రికార్డుల్లోనూ లేకుండా చేస్తున్నారు. భూములు కబ్జా అయినట్లు గుర్తించిన వక్ఫ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

● మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై రెండు సర్వే నంబర్లలో 13 ఎకరాల్లో వక్ఫ్ స్థలాలున్నాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సగానికిపైగా ఆక్రమణలకు గురయ్యాయి. మిగతా స్థలాల్లోనూ ఇతరుల కన్ను పడింది. తొలుత చిన్నపాటి షెడ్డులు వేసుకుని తర్వాత ఇళ్లను నిర్మించుకుంటున్నారు. ఇక్కడ ఎకరా విలువ సుమారు రూ.2 కోట్లకు పైగానే ఉంటుంది.

● నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలో మొత్తం 460 ఎకరాల్లో వక్ఫ్ భూములున్నాయి. ఊట్కూరు, పులిమామిడి, కొల్లూరు, నిడుగుర్తి, పెద్దజట్రంలో ఈ భూములున్నాయి. కేవలం ఊట్కూర్‌లోనే 328 ఎకరాల్లో వక్ఫ్ స్థలాలుండగా ఇప్పటికే పలు భూములు అన్యాక్రాంతమైనట్లు సమాచారం. గతంలో ఈ భూములను కొందరు స్థిరాస్తి వ్యాపారికి విక్రయానికి పెట్టడం వివాదాస్పదమైంది. తర్వాత మాజీ ఈ భూములను అధికారులు పట్టించుకోవడం మానేశారు.

● వనపర్తి జిల్లా అమరచింతలోని ఓ దర్గాకు వివిధ సర్వే నంబర్లలో 60 ఎకరాలకు పైగా స్థలాలున్నాయి. ఈ భూముల్లో సగానికి పైగా అన్యాక్రాంతమయ్యాయి. ఆక్రమణలపై గతంలో రెవెన్యూ అధికారులు విచారణ చేసినా ఫలితం లేకపోయింది.

● గద్వాల పట్టణంలోనూ వక్ఫ్ భూముల్లో నిర్మాణాలు చేపట్టారని కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. ఇప్పటి వరకు ఎలాంటి విచారణ జరగలేదు. నాగర్‌కర్నూల్ జిల్లాలోనూ కొన్నిచోట్ల వక్ఫ్ స్థలాలు కనిపించడం లేదు.

పూర్తిస్థాయిలో సర్వే చేస్తే..

వక్ఫ్ భూములపై అధికారులు పూర్తిస్థాయిలో సర్వే చేయడం లేదు. సర్వే చేసి హద్దులు గుర్తించి బోర్డులు ఏర్పాటు చేయాలి. వక్ఫ్ ఇన్‌స్పెక్టర్లు ఈ భూములపై నిరంతరం నిఘా పెట్టాల్సి ఉన్నప్పటికీ ఉమ్మడి జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు. మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్(రెవెన్యూ) మోహన్‌రావు మాట్లాడుతూ వక్ఫ్ భూముల పరిరక్షణ కోసం కమిటీల వివరాలు కావాలని ఇటీవలే ఉన్నతాధికారులు కోరారన్నారు. ఈ భూముల పరిరక్షణకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 90శాతం భూములు గెజిట్‌లో ఉన్నాయని, వీటిని అన్యాక్రాంతం చేయడానికి వీలు లేదన్నారు.

పకడ్బందీగా ధాన్యం సేకరణ



● 97 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
● 'న్యూస్‌టుడే'తో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజరు దేవదాసు

ముఖాముఖి

న్యూస్‌టుడే- నారాయణపేట

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. వసతుల కల్పనతోపాటు రైతులకు ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రణాళిక రచించారు. గతంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పకడ్బందీ చర్యలు తీసుకున్నామని పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజరు దేవదాసు అన్నారు. 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో పలు అంశాలపై స్పందించారు.

? ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఎంతవరకు వచ్చింది?

✔ 97 ఏర్పాటు చేస్తున్నాం.. ఐకేపీ ఆధ్వర్యంలో 40, సహకార సొసైటీల్లో 57, మెప్మా ఆధ్వర్యంలో రెండు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాం. కొన్ని మొదలయ్యాయి.

? జిల్లాలో సేకరణ లక్ష్యం ఎంత?

✔ సన్న, దొడ్డురకం ధాన్యం కలిపి 3.52 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందులో 1.89 లక్షల మెట్రిక్ టన్నులు సన్న రకం, 1.63లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు రకం తీసుకుంటాం. సన్నరకం వడ్లకు క్వింటాలుకు రూ.500 ప్రభుత్వం బోనస్ ప్రకటించింది. ఏ గ్రేడ్ రూ.2320లు, సాధారణ రకం రూ.2300 మద్దతు ధరలు ఉన్నాయి.

? కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

✔ ఏ రైతుకూ కొనుగోలు కేంద్రంలో ఇబ్బంది పడకూడదన్నదే లక్ష్యం. ముఖ్యంగా తాగు నీటి సౌకర్యం, విద్యుత్తు సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలని సూచించాం. 88 లక్షల గన్నీ బస్తాలు అవసరమవుతాయి. ప్రస్తుతం 20 లక్షలు అందుబాటులో ఉన్నాయి. కేవలం టార్పాలిన్లు 3వేలకుగాను 1124 మాత్రమే ఉన్నాయి. ప్యాడీ క్లీనర్లు 55 మాత్రమే ఉండగా, తూకం యంత్రాలు 42, తేమ శాతం యంత్రాలు 56 అదనంగా ఉన్నాయి. టార్పాలిన్లకు సైతం ప్రతిపాదనలు పంపించాం. కొనుగోలు ఊపందుకునే లోపు అవసరమైన బస్తాలు, ఇతరత్రా సామగ్రి అందుబాటులోకి వస్తాయి.

? సన్న, దొడ్డు రకాలకు వేర్వేరు కౌంటర్లు ఉంటాయా? రవాణా ఇబ్బందులు మాటేమిటి?

✔ కేంద్రాల్లో కౌంటర్లను వేర్వేరుగా ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి కేంద్రంలోనూ అయిదుగురు సిబ్బంది కచ్చితంగా ఉండాలని నిర్వాహకులకు సూచించాం. ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యం లారీల్లోనే తరలించాలని సూచించాం. పెద్దమొత్తంలో ధాన్యం సేకరించినప్పటికీ వెంటనే సమాచారం అందిస్తే రవాణాకు సంబంధించి వాహనాలను సైతం ఏర్పాటు చేస్తాం. ట్రాక్టర్లలో తరలించే ప్రసక్తే లేదు. రైతులకు ఎలాంటి ఇబ్బందీ కలగనీయం.



సఫారీని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, చిత్రంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ

జంగిల్ సఫారీని ప్రారంభించిన మంత్రి

మన్ననూరు(అమ్రాబాద్), న్యూస్‌టుడే : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ పెద్దపులుల అభయారణ్యంలోని జంగిల్ సఫారీని ఫర్హాబాద్ గేట్ వద్ద వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా మంగళవారం పునఃప్రారంభించారు. 3 కొత్త పర్యాటక వాహనాలను అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నల్లమలలో పర్యాటకాభివృద్ధికి ముఖ్యమంత్రి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టును తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు. ఇక్కడి పర్యాటకాభివృద్ధితో చెంచు యువకులకు ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు మన్ననూరులో ఎమ్మెల్యే, అటవీ శాఖాధికారులు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖాధికారి రోహిత్‌గోపిడి, ఎఫ్‌డీవో రామమూర్తి, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌డీవో రామ్మోహన్, ఎఫ్ఆర్వోలు దేవజ, డీఆర్‌వోలు, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీవోలు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాల నుంచి తల్లితో కలిసి వస్తున్న విద్యార్థిని



సత్యనారాయణ చౌరస్తా వద్ద కిక్కిరిసిన ఆటోలో తరలివెళ్తూ..



తల్లిదండ్రులను లగేజీ ఇచ్చేయాలని కోరుతున్న విద్యార్థులు



బస్టాండ్ రోడ్డులో ద్విచక్రవాహనంపై లగేజీ, కుటుంబ సభ్యులతో

బడులకు టాటా.. ఇంటి బాట

పాఠశాలలకు మంగళవారం నుంచి దసరా సెలవులు ఇవ్వడంతో వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఇళ్లకు పయనమయ్యారు. తల్లిదండ్రులు, తోబుట్టువులు తీసుకెళ్లడానికి రావడంతో అంతటా సందడి వాతావరణం నెలకొంది. పిల్లలను చూసిన తల్లిదండ్రుల కళ్లు మెరిసాయి. బస్టాండ్లు విద్యార్థులతో కళకళలాడాయి. మంగళవారం నారాయణపేటలో కనిపించిన దృశ్యాలివి.

–న్యూస్‌టుడే, నారాయణపేట



మహబూబ్‌నగర్‌లోని ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఎంవీఎస్ కళాశాలకు మహర్దశ

రూ.10కోట్లతో పీజీ విద్యార్థినుల వసతి గృహం నిర్మాణం

న్యూస్‌టుడే, పాలమూరు : ఉమ్మడి జిల్లాకే కీలకమైన మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఎంవీఎస్ డిగ్రీ, పీజీ కళాశాలకు మహర్దశ రానుంది. ఇక్కడి పీజీ విద్యార్థినుల కోసం పీఎం ఉష పథకం కింద రూ.10 కోట్ల నిధులతో బాలికల వసతి గృహం మంజూరైంది. కళాశాలలో 3,910 మంది విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల్లో ఎంవీఎస్ నాలుగో స్థానంలో ఉంది. అందుకే రాష్ట్రంలో ములుగు కళాశాలతో ఎంవీఎస్‌కు పీజీ బాలికల వసతిగృహం మంజూరు చేశారు. దీన్ని కళాశాల ప్రాంగణంలో ఇప్పటికే ఉన్న బాలికల వసతి గృహం పక్కనే రెండు అంతస్తులతో విశాలంగా, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా నిర్మించనున్నారు. టెండర్ ప్రక్రియ కూడా పూర్తి కావడంతో దసరా తర్వాత పనులను చేపట్టనున్నారు. ఈ భవన నిర్మాణానికి కేంద్రం రూ.6కోట్లు కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.4కోట్లను మంజూరు చేసింది.

ఉద్యోగార్థులకు కూడా వసతి : ఎంవీఎస్ కళాశాలలో ఇప్పటికే ఉన్న వసతిగృహంలో డిగ్రీ, పీజీ విద్యార్థినులు ఉంటున్నా అది ఏమాత్రం సరిపోవటం లేదు. కళాశాలలో ఉన్న ఏడు పీజీ కోర్సులను 500ల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. కొత్త వసతిగృహం నిర్మిస్తే దాన్ని పీజీ విద్యార్థినులకే కేటాయిస్తారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ స్టడీ సర్కిళ్లలో శిక్షణ తీసుకుంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న మహిళలు, విద్యార్థినులకు కూడా ఎలాంటి రుసుము లేకుండా వసతి, భోజనం కల్పిస్తారు. 250 మంది ఉండే నిర్మించే ఈ వసతి గృహంలో ప్రత్యేక గ్రంథాలయం ఏర్పాటు చేసి పోటీ పరీక్షల పుస్తకాలు, పత్రికలు అందుబాటులో ఉంచుతారు. వసతి గృహం ముందు చిన్న ఉద్యానం కూడా ఏర్పాటు చేస్తారు.

100 గదుల ప్రణాళికకు పచ్చజెండా : కళాశాలలో ఏటా కొత్త కోర్సులు మంజూరవుతున్నాయి. విద్యార్థుల సంఖ్య కూడా ఏటికేడు పెరుగుతోంది. ఇప్పటికే ఉన్న తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. ఈ నేపథ్యంలో రూ.70 కోట్ల వ్యయంతో రెండస్థుల్లో 100 తరగతి గదులను నిర్మించడానికి రూపొందించిన బృహత్తర ప్రణాళికకు ప్రభుత్వం నుంచి పాలనాపరమైన అనుమతులు వచ్చాయి. దాతలు, పూర్వ విద్యార్థులు అందించే విరాళాలతో వీటిని నిర్మించాలని కళాశాల యాజమాన్యం యోచిస్తోంది.



అన్ని రంగాల్లో ముందుంచుతాం.. : ఎంవీఎస్ కళాశాలలోనే నేను చదివాను. ఇప్పుడు ఆ ప్రిన్సిపల్‌గా పనిచేయటం గొప్ప అనుభూతి. కళాశాల అభివృద్ధికి నా నెల వేతనంలో సగం ఇస్తాను. నాతో పాటు చాలా మంది సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నారు. అందరి సౌజన్యంతో కళాశాలను అభివృద్ధి చేసి విద్యార్థులకు అన్ని రకాల వసతులన కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం. పీఎం ఉష కింద మంజూరైన వసతిగృహం నిర్మాణ పనులు టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీకి ప్రభుత్వం అప్పగించింది.

- కె.పద్మావతి, ప్రభుత్వ ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్

పేట-మక్తల్ రహదారి దయనీయం : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేశ్‌గౌతం

నారాయణపేట, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో రోడ్డు భద్రతపై సమీక్ష నిర్వహించారు. ప్రతినెలా సమావేశం తప్పనిసరిగా నిర్వహించాలని, తీసుకున్న నిర్ణయాలు ఎలా అమలయ్యాయో చర్చించాలన్నారు. నారాయణపేట నుంచి మక్తల్ వెళ్లే రోడ్డు అంశంపై కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంత దయనీయమైన రోడ్డు మరెక్కడా ఉండదేమో అని వ్యాఖ్యానించారు. ఈ రోడ్డుపై అంబులెన్స్ వాహనాలను తీసుకురావద్దని, ప్రత్యామ్నాయ రోడ్డును ఎంపికచేసి నివేదిక ఇవ్వాలని డీఎస్పీ నల్లపు లింగయ్యకు సూచించారు. రోడ్డువేసిన గుత్తేదారుడిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బీ ఈఈని ఆదేశించారు. మరమ్మతులు ఎందుకు చేపట్టలేదని కలెక్టర్ ప్రశ్నించారు. రోడ్డు మార్గంలో కొన్ని కాలువలు ఉండటంతో వరదనీరు పారుతూ గుంతలు ఏర్పడినట్లు ఆర్అండ్‌బీ అధికారులు వివరించారు. వరద నష్టం నిధులు రూ.14కోట్లతో 26 కిలోమీటర్ల మేరకు మక్తల్ కొత్త రోడ్డుకు ప్రతిపాదనలు పంపించినట్లు అధికారులు తెలియజేశారు. కాజ్‌వేలు, గ్రామ మార్గాల వద్ద సీసీ రోడ్డు వేస్తూ మీటరు ఎత్తుపెంచి తారు వేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆర్అండ్‌బీ ఈఈ దేశ్యానాయక్ తెలిపారు. గత సమావేశాల్లో జిల్లాలో గుర్తించిన ప్రమాద మలుపు దారులు, ప్రమాద జోన్ల వద్ద సైన్‌బోర్డులు, ప్రమాద నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎన్‌హెచ్ఏ ఈఈ శాలిని వివరించారు. ఎస్పీ యోగేశ్‌గౌతం మాట్లాడుతూ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు శాఖాపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. కృష్ణా కూడలిలో మరింత అప్రమత్తత అవసరమన్నారు. జిల్లా కేంద్రంలో చాలా చోట్ల వాహనాలు రాంగ్ రూట్లో వెళ్తున్నాయని, మరికల్, మక్తల్, కోస్గి పట్టణాల్లో వన్ వే రోడ్ల గురించి కమిటీ వేయాలని ఎస్పీ సూచించారు. సమావేశంలో ఆర్డీవో మేఘా గాంధీ, ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య, మున్సిపల్ కమిషనర్ సునీత, సీఐలు పాల్గొన్నారు.

గుండుమాల్‌కు ప్రభుత్వ జూనియర్ కళాశాల

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే : మండల కేంద్రం గుండుమాల్‌కు ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరయ్యింది. 169 జీవోను ఈ మేరకు ప్రభుత్వం విడుదల చేసింది. 2024-2025 విద్యాసంవత్సరానికి కళాశాల ఏర్పాటుకు రూ.7,84,51,648 కేటాయించింది. భవన నిర్మాణానికి రూ.5.5 కోట్లు, సామగ్రి సమకూర్చడానికి రూ.2,34,51,648 నిధులను కేటాయించినట్లు పేర్కొన్నారు.

బసవతారకం ఆస్పత్రిలో మహిళలకు ఉచితంగా పరీక్షలు

హైదరాబాద్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో అక్టోబరు 1 నుంచి 20వ తేదీ వరకు మహిళా క్యాన్సర్ రోగులకు ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని ఆసుపత్రి వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి. అక్టోబర్‌ను రొమ్ము కాన్సర్ అవగాహన మాసంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో 'స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్' పేరిట ఈ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. అన్ని పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కన్సల్టేషన్ ఉంటుందని, మ్యామోగ్రామ్ పరీక్షల్లో 25 శాతం రాయితీ, ఇతర పరీక్షల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు 040-23551235, 23550967 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

ఎల్ఐసీ ప్రైవేటీకరణ బిల్లు అడ్డుకున్న ఏచూరి

సంస్మరణ సభలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీ మధు



సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ ఎంపీ మధు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అప్పట్లో పార్లమెంటులో ప్రవేశపెట్టిన ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసీ ప్రైవేటీకరణ బిల్లును సీతారాం ఏచూరి అడ్డుకున్నారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీ మధు అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ పట్టణం అంబేడ్కర్ కళాభవన్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రాములు అధ్యక్షతన సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించి ఏచూరికి శ్రద్ధాంజలి ఘటించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీ మధు ప్రసంగిస్తూ ప్రణబ్ ముఖర్జీ ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో బీమా ప్రైవేటీకరణ బిల్లును ప్రవేశపెడితే తన వాదనతో వెనక్కి పంపేలా చేశారని పేర్కొన్నారు. ఏచూరి ఎంపీగా పార్లమెంటులో గళమెత్తారని, బయట ప్రజా సమస్యలపై పోరాడి ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చారని పేర్కొన్నారు. ఆయన మరణం వామ పక్ష పార్టీలకు, దేశాభివృద్ధికి తీరని లోటన్నారు. ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గినా కూడా కేంద్ర ప్రభుత్వం ఇక్కడ పెట్రో, డీజిల్ ధరలు తగ్గించకపోవడం దారుణమన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత ఉద్యోగాలను నేరుగా భర్తీ చేసే రిజర్వేషన్లను తొలగించేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని విమర్శించారు. లౌకికవాద భారతదేశంలో ఒక దేశం, ఒకే ఓటు పేరుతో జమిలి ఎన్నికలు తేవాలన్న ప్రధాని మోదీ ఆలోచన సఫలీకృతం కాదన్నారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ సీతారాం ఏచూరి మహాజ్ఞాని అని కొనియాడారు. ఏచూరితో పాటు ఓ వేదిక పంచుకున్నానని, ఈ సందర్భంగా ఆయన భారత తత్వశాస్త్రంపై అనర్గళంగా మాట్లాడారని గుర్తు చేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఏచూరి మృతి కమ్యూనిస్టు పార్టీలకు తీరనిలోటన్నారు. సభలో పురపాలక సంఘం ఆనంద్ కుమార్ గౌడ్, జేపీఎన్‌సీఈ ఛైర్మన్ కేఎస్ రవి కుమార్, సీపీఐ సీనియర్ నాయకుడు కె.రామ కృష్ణ, జిల్లా కార్యదర్శి బాలకిషన్, నాయకులు రాంచందర్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లె గోపాల్, పద్మ, కురుమూర్తి, చంద్రకాంత్, నాయకులు మోహన్, ప్రశాంత్, నందు, భరత్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బస్టాండులో నాలా తొలగింపునకు అడుగులు

● 'ఈనాడు' వరుస కథనాలతో కదలిక
● రూ.2 కోట్ల అంచనాతో ఈఎన్‌సీకి ప్రతిపాదనలు



ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం మీదుగా ప్రవహిస్తున్న పెద్ద చెరువు నాలా

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని బస్టాండులో ప్రయాణికులకు దుర్గంధం వెదజల్లుతూ, ఆర్టీసీ ఉద్యోగులకు ప్రాణ సంకటంగా పరిణమించిన పెద్దచెరువు మురుగు నాలా తొలగింపునకు అడుగులు పడుతున్నాయి. ఈ మురుగు నాలాపై 'ఈనాడు'లో వరుస కథనాలు ఇస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి, డీఎం సుజాత ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, డిపో ఉద్యోగులు అనారోగ్యాల బారినపడుతున్న వైనాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన మురుగు కాల్వ దారి మళ్లించే విషయమై పురపాలక ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్‌కు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని సూచించారు. ఎమ్మెల్యే సూచనతో ఇటీవల పురపాలక అధ్యక్షుడు ఆనంద్‌కుమార్‌గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి ప్రయాణ ప్రాంగణం గుండా ప్రవహిస్తున్న పెద్దచెరువు నాలా దుస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆ తర్వాత పురపాలక ఈఈ బస్వరాజ్, వారి ఇంజినీరింగ్ బృందంతో ఆర్టీసీ ప్రాంగణం గుండా ప్రవహిస్తున్న నాలాను పరిశీలించారు. అంబేడ్కర్‌నగర్, పీర్లబావి వైపు డిపో వెనక ప్రదేశాన్ని కూడా పరిశీలించి నాలాను ఎక్కడి నుంచి ఎలా దారి మళ్లించాలో ఒక అంచనాకు వచ్చారు. అంబేడ్కర్‌నగర్ సామాజిక భవనం వద్ద బస్టాండు వైపు పెద్దచెరువు నాలా దారి మళ్లిన విషయం తెలిసిందే. నాలా మొత్తం బస్టాండు ఆవరణ గుండా వెళ్లకుండా చర్యలు చేపడతారు. బస్టాండు ప్రహరీ లోపల 3 మీటర్ల విస్తీర్ణంతో 2 మీటర్ల లోతుతో డిపో ప్రహరీ వెనక భాగం గుండా పీర్లబావి వైపు దారి మళ్లిస్తారు. ఇలా 300 మీటర్ల వరకు నాలాను పొడిగిస్తూ పెద్దచెరువు వరకు నిర్మిస్తారు. ఈ పనుల కోసం రూ.2కోట్ల నిధులు అవసరమని ఈఈ బస్వరాజ్ అంచనా వేశారు. ఈ నివేదికను గత నెల రెండో వారంలో అటు ప్రజారోగ్యశాఖ ఈఎన్‌సీకి, ఇటు సీడీఎంఏకు పంపించారు.

బాపూ మాట.. బంగారు బాట

● అమలు చేస్తే ప్రగతి పరుగులు
● నేడు గాంధీ జయంతి

న్యూస్‌టుడే- అచ్చంపేట, కోస్గి

జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని బుధవారం దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నారు. ఆయన మాటలు సమాజ హితానికి బంగారు బాటలు వేస్తాయి. శాంతి, అహింస సిద్ధాంతాలను నమ్మిన మహాత్ముడు వాటితోనే పోరాటం చేశారు. గాంధీజీ అహింస, మద్యపాన నిషేధం, అంటరానితనం నిర్మూల, గ్రామ స్వరాజ్యం, నిజాయతీ, మత సామరస్యం వంటి సిద్ధాంతాలను ప్రపంచానికి చాటి చెప్పారు.

ఆదర్శం.. అనుసరణీయం

➡ మహాత్ముడు మంచి మార్గం ఎక్కడున్నా అనుసరించాలి


★ పాలమూరులో ఇలా: నారాయణపేట జిల్లా ఎక్లాస్‌పూర్‌లో గత 15 ఏళ్లుగా మద్య నిషేధం అమలు చేస్తున్నారు. మాతా మాణికేశ్వరి అహింస, మద్యపాన నిషేధం, శాంతిని భక్తులకు ప్రబోధించే వారు. ఆమె భక్తులు ఇప్పటికీ అనుసరిస్తున్నారు. అచ్చంపేట సమీపంలోని బక్కలింగాయపల్లిలో కూడా సంపూర్ణ మద్య నిషేధాన్ని అమలు చేస్తున్నారు. ఈ గ్రామంలో అత్యధికులు గిరిజనులు ఉండటం విశేషం.

అంటరానితనం అమానుషం

➡ అంటరానితనం అమానుషం. సృష్టిలో అందరూ సమానం. వివక్ష కూడదు.

★ ఇప్పటికీ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. కృష్ణా మండలం ముడుమాల్‌లో ఇటీవల దళితుల పెళ్లి అడ్డుకున్నారని ఆలయ పూజారిని విధుల నుంచి తొలగించారు. పోలీసులు, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో పౌర దినోత్సవాన్ని నిర్వహిస్తూ అంటరానితనాన్ని నిర్మూలించేందుకు కృషి చేస్తున్నారు.

సత్యమేవ జయతే!



➡ మహాత్ముడు నిజాయతీకి మారుపేరుగా నిలిచారు. చేసిన తప్పులను గుర్తించి సరి చేసుకోవడానికి ప్రాధాన్యం ఇచ్చారు.

★ ఉమ్మడి జిల్లాలో ఎన్నో సమస్యలు ఏళ్ల తరబడిగా ఎన్నికల వాగ్దానాలుగా ఉపయోగపడుతున్నాయి. ఎన్నికలు వచ్చినప్పుడల్లా హామీ ఇవ్వడం పరిపాటిగా మారింది. గెలిచిన తరువాత ఎవరూ వాటిని పట్టించుకోవడం లేదు.

అహింసతోనే విజయం

➡ అహింసతోనే విజయాన్ని సాధించవచ్చని మహాత్ముడు ప్రబోధించారు. భారతదేశాన్ని సుమారు వందల ఏళ్లపాటు పాలించిన ఆంగ్లేయుల బారి నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకు అహింస మార్గాన్ని ఎంచుకున్నారు.



ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (పాత)

★ ఎన్నికల ఘట్టంలో గతంలో హింస చెలరేగి రక్తపాతం చోటు చేసుకునేది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో గత ఏడాది జరిగిన అసెంబ్లీ, ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి హింసకు తావు లేకుండా ఎన్నికల సంఘం బాపూజీ ఆశయాలను అమలు చేసి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడంలో సఫలీకృతమైంది.

మద్య నిషేధంతోనే అభివృద్ధి



➡ మహాత్ముడు మద్యనిషేధంతోనే ప్రగతి సాధ్యమవుతుందని చాటి చెప్పారు. మద్యంతో ఎన్నో అలజడులు చోటు చేసుకుంటున్నాయి. గాంధీజీ బాటలో నడచేందుకు పాలకులు ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

★ మద్యం ఉమ్మడి జిల్లాలో ఏరులై పారుతోంది. తిమ్మాజిపేట టీసీబీసీఎల్ నుంచి మద్యం సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 153 మద్యం దుకాణాలు, 23 బార్లు ఉన్నాయి. నెలకు రూ. 150 కోట్ల విలువైన అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రత్యేక ఉత్సవాలు, పండగలు, ఎన్నికల సమయంలో అదనంగా మరో రూ. 50 కోట్ల విలువైన మద్యం అమ్ముడవుతోంది. నెలకు 2.09 లక్షల కేసుల మద్యం, 2.51 లక్షల కేసుల బీర్లు అమ్ముడవుతున్నాయి. తాగుడుకు బానిసలై ఎంతో మంది ప్రాణాలు కోల్పోతుండటంతో కుటుంబాలు వీధిన పడుతున్నాయి.

సంపూర్ణ పారిశుద్ధ్యం

➡ మహాత్ముడు సంపూర్ణ పారిశుద్ధ్యంతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం కేవలం 32.7 శాతం గ్రామీణ గృహాలకు మాత్రమే వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నట్లు తేలింది.



★ ప్రధాని మోదీ సంసద్ ఆదర్శ్ గ్రామ యోజనలో భాగంగా 2014 అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛ భారత్ అభియాన్‌ను ప్రారంభించారు. గ్రామాల్లో ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలు కల్పించాలన్న లక్ష్యంతో దేశంలోని ప్రతి ఎంపీ తన పరిధిలోని ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రారంభంలో కొంత హడావిడి కనిపించినా పూర్తి స్థాయిలో ఫలితాలు సాధించలేకపోయారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడంతో ప్రస్తుతం 72 శాతం వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకున్నారు.

★ అచ్చంపేట మండలం బక్కలింగాయపల్లిలో వెయ్యి జనాభా ఉంది. తొలిసారి సర్పంచిగా ఎన్నికైన లక్ష్మీలాలునాయక్ కుమారుడు నవీన్‌కుమార్ ఎక్సైజ్ డీఎస్పీగా ఉన్న సమయంలో అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ శ్రీదేవి సహకారంతో గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. నాటుసారా బట్టీలు ధ్వంసం చేసి ప్రజల ఆలోచనలో మార్పుతీసుకొచ్చారు. ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత, వ్యక్తిగత మరుగుదొడ్డి ఏర్పాటు చేసుకున్నారు. శుద్ధజల కేంద్రంతో అందరికీ నీరందిస్తున్నారు. ఊళ్లో మూడు వేల మొక్కలు నాటి ప్రతి మొక్క సంరక్షణకు ట్రీగార్డును ఏర్పాటు చేయించారు. 7 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసి చక్కగా నిర్వహిస్తున్నారు.





మహబూబ్‌నగర్: ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు, అధ్యాపకులు

చిత్తూ చిత్తుల బొమ్మ.. శివుడి ముద్దుల గుమ్మ..

'చిత్తూచిత్తుల బొమ్మ... శివుడి ముద్దుల గుమ్మ... బంగారు బొమ్మ దొరికేనమ్మా ఈ వాడలోన..' వంటి బతుకమ్మ పాటలతో ఊరూవాడా నాట్యమాడుతోంది. తెలంగాణ సంస్కృతిలో భాగమైన బతుకమ్మ సంబరాలకు జిల్లా సన్నద్ధమైంది. దసరా సెలవుల కారణంగా విద్యాలయాల్లో కాస్త ముందే బతుకమ్మ సంబరాలు చేస్తున్నారు. ఉమ్మడి పాలమూరులో కొన్ని స్కూళ్లు, కళాశాలల్లో సందడి చూద్దామా.. - న్యూస్‌టుడే, బృందం



దేవరకద్ర: చౌదర్‌పల్లి వద్ద కళాశాలలో నిర్వహించిన వేడుకలో విద్యార్థులు, అధ్యాపకులు



ఉండవల్లి: అలంపూర్‌చౌరస్తాలో..





వెల్దండ: కొత్తతాండ సమీపంలో ఓ పాఠశాలలో.. పేట డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే పర్ణిక



అచ్చంపేట: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

చదువులకు విరామం.. ఇళ్లకు పయనం







1. సొంత గ్రామాలకు వెళ్తున్న విద్యార్థులు 2. సీటు కోసం సర్కస్ ఫీట్లు 3.బస్సులో స్థలం లేక ఫుట్‌బోర్డుపై ప్రయాణం

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించడంతో విద్యార్థుల చదువులకు కొన్ని రోజులు విరామం లభించింది. బుధవారం నుంచి సెలవులు కావడంతో ప్రభుత్వ, ప్రైవేటు వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్న వారు మంగళవారం ఇళ్ల బాటపట్టారు. ఈ నేపథ్యంలో గద్వాల ఆర్టీసీ బస్టాండ్‌లో కన్పించిన చిత్రాలే ఇవి.

కల్వకుర్తి పురపాలికకు స్వచ్ఛతా గుర్తింపు

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం కల్వకుర్తి పురపాలికకు అవార్డు ప్రకటించింది. గత నెల 17నుంచి నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయడంతో పుర సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులను ప్రభుత్వం అభినందించింది. తడి పొడి చెత్తను వేరుచేసి తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు డీఆర్సీ సెంటర్‌ను నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులకు, పురకమిషనర్‌కు అవార్డు అందించనున్నారు. ఈ మేరకు కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి కార్యాలయం నుంచి పుర కమిషనర్‌కు సమాచారం అందించారు. బుధవారం దిల్లీలో జరిగే స్వచ్ఛభారత్ దివాస్ కార్యక్రమంలో ప్రధాని మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. కమిషనర్ మహమూద్ షేక్, ఎస్‌హెచ్‌జీ అధ్యక్షురాలు స్వరాజ్యలక్ష్మి, సభ్యులు దిల్లీకి బయలుదేరారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి జీవితఖైదు

మహబూబ్‌నగర్ నేరవిభాగం: బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి న్యాయమూర్తి జీవిత ఖైదు విధించారు. ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం 2017లో కర్నూలుకు చెందిన విజయానంద్ ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. స్పెషల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి కేసు విషయాలను పరిశీలించి సాక్ష్యులతో విచారణ చేసి మంగళవారం తన తీర్పు వెలువరించారు. నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.20వేల జరిమానా విధించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటానికి కృషి చేసిన పీపీ పరందాములు, ఏపీపీ బాలస్వామి, అప్పటి సీఐ రామకృష్ణ, ఎస్సైలు గడ్డం కాశీ, విజయ్‌కుమార్, సీఐ గాంధీనాయక్, ఏఎస్సై బాలకృష్ణ, నాగిరెడ్డి, అశోక్‌రెడ్డిలను ఎస్పీ డి.జానకి అభినందించారు.

రాగి జావ ఇచ్చేదెలా?



'మింగ మెతుకులేదు.. మీసాలకు సంపెంగ నూనె' అన్న నానుడి సోమవారం కరీంనగర్ జిల్లా మానకొండూరులో పోషణ జాతర సందర్భంగా మంత్రి సీతక్క చేసిన ప్రకటన చూస్తే గుర్తుకొస్తోంది. అంగన్‌వాడీల్లో గర్భిణులు, చిన్నారులకు అదనంగా రాగిజావ ఇస్తామని మంత్రి చెప్పారు. ఇప్పుడు ఇస్తున్న నిధులే ప్రభుత్వం చెల్లించటం లేదు. పౌష్టికాహారం సరిపోని పరిస్థితుల్లో రాగిజావ ఎలా అందజేస్తారన్నది ప్రశ్న.



న్యూస్‌టుడే- నారాయణపేట న్యూటౌన్

ప్రస్తుతం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పౌష్టికాహారం కోసం రోజుకు ఒక్కొక్కరికీ 70 పైసలు అందజేస్తోంది. బాలింతలు, గర్భిణులకు ఒక్కొక్కరికీ రూ. 1.50 చొప్పున ఇస్తోంది. ధన్వాడలో ఓ అంగన్‌వాడీ కేంద్రాన్ని తీసుకుంటే ఇక్కడ మొత్తం పది మంది పిల్లలు ఉన్నారు. వీరికి అదనంగా ఏడుగురు గర్భిణులు, ముగ్గురు బాలింతలు ఉన్నారు. వీరందరికీ రోజూ మధ్యాహ్నం పౌష్టికాహారాన్ని వండి అందించాల్సి ఉంటుంది. ఈ లెక్కన పది మంది పిల్లలకు రోజుకు రూ.7, బాలింతలు గర్భిణులకు రూ. 15 ప్రభుత్వం అందజేస్తోంది. ఈ రెండింటినీ కలిపితే మొత్తం రూ. 22 ఇస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలను పరిగణలోకి తీసుకుంటే రూ. 22కు పావుకిలో కూరగాయలు రావు. వీటితో 20 మందికి పౌష్టికాహారం వండి పెట్టాలంటే ఎలా సాధ్యమో ప్రభుత్వానికే తెలియాలి. ఉమ్మడి జిల్లాలోని అన్ని కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కూరగాయలు కోసం ఇస్తున్న నిధులు 'కొండంత' వరకు.. 'కొనిరిందే గుమ్మడి కాయ' చందాన్ని తలపిస్తున్నాయి.

● ఏదైనా ప్రభుత్వ కార్యక్రమాలు జరిగినప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలనే ముందు పెడుతుంటారు. కొన్ని సందర్భాల్లో కొంతమందికి అదనంగా వండి వడ్డించాల్సి వస్తోంది. ఇది మరికొంత అదనపు భారం. కొంతమంది అంగన్‌వాడీ కార్యకర్తలు నిబద్ధతతో

● ఉమ్మడి పాలమూరు జిల్లాలో 5,548 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో సుమారు 2.80 లక్షల పిల్లలు, 40వేల దాకా బాలింతలు, గర్భిణులు ఉన్నారు. వీరందరికీ రోజూ మధ్యాహ్నం పౌష్టికాహారాన్ని అందించాలి. కూరగాయల కోసం ఇస్తున్న నిధులు చాలకపోవడంతో నిర్వాహకులు ఏ కూరగాయ తక్కువ ఉందో దాన్నే కొనుగోలు చేసి వడ్డిస్తున్నారు. మాటి మాటికీ వీటినే పెడుతుండటంతో పౌష్టికాహారం అనే మాటకే విలువే లేకుండా పోతోంది. కొన్ని కేంద్రాల్లో తక్కువ ధరకు వస్తాయని బజార్లలో రెండోరకం సరకు కొంటున్న సందర్భాలూ ఉంటున్నాయి. అధికారులు తనిఖీలకు వస్తున్నారని తెలిస్తే మాత్రం కొంత మెరుగ్గా భోజనం ఉంటుంది.

గతంలో వంట గ్యాస్ కోసం ఒక్కొక్క విద్యార్థికి రోజుకు రెండు పైసలు, బాలింతలు, గర్భిణులకు మూడు పైసలు చొప్పున ఇచ్చేవారు. కొన్ని సంవత్సరాలుగా వీటిని నిలిపేశారు. ప్రస్తుతం సిలిండర్ నిధులను నిర్వాహకులే భరించాల్సి వస్తోంది. గత ఏడాది ఉసిరిపొడి దినుసుల ప్యాకెట్లను అందజేస్తున్నారు. అరకొరగా ఉండటంతో ఏ మాత్రం సరిపోవడంలేదని నిర్వాహకులు వాపోతున్నారు. మళ్లీ బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. కూరగాయలకు ఇస్తున్న నిధులు మరీ తక్కువ ఉండటాన్ని గుర్తించకుండా నాణ్యమైన పౌష్టికాహారాన్ని వడ్డించాలని కోరడం ఏ మేరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొంతమంది సొంత డబ్బులు పెట్టి వండి పెడుతున్నారని అంగన్‌వాడీ కార్యకర్తలు అంటున్నారు.

ఉన్నంతలో మంచి ఆహారం అందించడానికి ప్రయత్నిస్తుండగా, కొన్నిచోట్ల పై నుంచి కింది స్థాయి వరకు చేతులు తడుపుతూ హాజరులో నమోదులో మతలబు చేసి పిల్లల కడుపు కొడుతున్నారు.

ప్రాణం తీసిన అరతులం బంగారం

తోడుగా ఉన్నవాడే నిందితుడు ● వీడిన మహిళ హత్య కేసు మిస్టరీ



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్, న్యూస్‌టుడే: ఒంటరితనానికి ఒక తోడు దొరికిందనుకుంది ఆ మహిళ.. కానీ ఆ తోడే అర తులం బంగారం కోసం తన ప్రాణాలు తీస్తుందని ఊహించలేకపోయింది. షాద్‌నగర్‌లోని శ్రీనివాసకాలనీలో ఇటీవల కవర్‌లో దొరికిన మహిళ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. మంగళవారం షాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ రంగస్వామి, సీఐ విజయ్‌కుమార్‌లు కేసు వివరాలు వెల్లడించారు. చౌదరిగూడ మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన ఒంటరి మహిళ భాగ్యలక్ష్మి(40) కొన్నేళ్లుగా ఫరూక్‌నగర్‌లోని అంబేడ్కర్ కాలనీలో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవించేది. గద్వాల జిల్లా చాగాపూర్‌కు చెందిన వడ్డె రమేష్ తాపీ మేస్త్రీ. వ్యసనాలకు బానిసైన ఇతన్ని భార్యాపిల్లలు వదిలేయడంతో 8 నెలల క్రితం షాద్‌నగర్ వచ్చాడు. ఒకేచోట కూలిపనులు చేసే వీరిద్దరి మధ్య పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. ఒంటరిగా ఉన్న తనకు ఓ తోడు దొరికిందనే సంతోషంతో ఆమె అడిగినప్పుడల్లా అతడికి డబ్బులు ఇచ్చేది. ఆమె చెవులకున్న అర తులం బంగారు కమ్మలమీద కన్నేశాడు. ఈ క్రమంలోనే గత నెల 27న ఆమె గొంతు నులిమి హత్య చేశాడు. చెవికమ్మలతో పాటు ఇంట్లో ఉన్న రూ.5 వేల నగదు, సెల్‌ఫోన్ దొంగిలించి మృతదేహాన్ని కవర్‌లో చుట్టి శ్రీనివాసకాలనీలో పారేశాడు. సీఐ విజయ్‌కుమార్, డిటెక్టివ్ సీఐ ప్రశాంత్, ఎస్సైలు శరత్, సుసీల, శంకర్, సిబ్బంది జోత్స్న, నరేందర్‌లు బృందంగా ఏర్పడి మూడు రోజుల వ్యవధిలోనే నిందితుడిని పట్టుకున్నారు. ఈ సందర్భంగా కేసును వేగంగా పరిష్కరించిన పోలీసులకు ఏసీపీ నగదు రివార్డులు అందజేశారు.

అలంపూర్‌లో వైభవంగా ఉత్సవాలు : కలెక్టర్



అలంపూర్‌చౌరస్తాలో ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

గద్వాల కలెక్టరేట్, ఉండవల్లి, న్యూస్‌టుడే: జోగులాంబ అమ్మవారి సన్నిధిలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీవోసీలోని కాన్ఫరెన్స్ హాల్లో దసరా ఉత్సవాలపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 3 నుంచి 12 వరకు నిర్వహించే ఈ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలన్నారు. పుష్కర్‌ఘాట్ వద్ద అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీసు, ఆరోగ్య, అగ్నిమాపక సేవలు అందుబాటులో ఉండాలని, ఉత్సవాల కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను నడిపించాలన్నారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు లేకుండా ఆ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు, దేవాలయం చేరుకునే మార్గంలో రోడ్లకు మరమ్మతులు చేయాలని సూచించారు. ఆర్డీవో రాంచందర్, ఈవో పురేందర్, అధికారులు పాల్గొన్నారు.

● అలంపూర్‌చౌరస్తా, డి.బూడిదపాడు, భైరాపురం కూడలిలో ప్రవేశద్వారాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాల వివరాలను ప్రవేశద్వారంపై పొందుపరిచారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

మానవపాడు, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి అందరి సమన్వయ సహకారంతో తన వంతు కృషి చేస్తామని డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బాధ్యతలు స్వీకరించాక.. తొలిసారిగా మానవపాడు సహకార సంఘం కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. కలుకుంట్ల గ్రామానికి చెందిన ఓ రైతుకు రుణమాఫీ కాకపోవడంతో సొసైటీ అధికారులను నిలదీశారు. డీసీసీబీ డైరెక్టర్ రంగారెడ్డి, సొసైటీ ఛైర్మన్ శ్రీధర్‌రెడ్డి, అయ్యన్న, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

దేవర: వనయాంబ(కోస్గి), వెంకటరమణ(మక్తల్), మనోహర్ (నారాయణపేట), సత్యం సుందరం: మహేశ్వరి(నారాయణపేట)

- న్యూస్‌టుడే, పాతబస్టాండ్, మక్తల్ రూరల్

కూరగాయల ధరలు(కిలోకు)



నారాయణపేట (పాతబస్టాండ్), న్యూస్‌టుడే : టమాట రూ.70, వంకాయలు రూ.60, ముక్క వంకాయలు రూ60, ఆలుగడ్డ రూ.50, కాకరకాయ రూ.80, క్యారెట్ రూ.70, బెండకాయలు రూ.50, బీరకాయలు రూ.70, దొండకాయలు రూ.60, పచ్చిమిర్చి రూ.40, చిక్కుడు రూ.60, పెద్ద చిక్కుడు రూ.90, గోకరకాయ రూ.70, క్యాప్సికం 70, బీన్స్ 90, కాలీఫ్లవర్ రూ.80, దోసకాయ రూ.60. క్యాబేజీ రూ.40, ఉల్లి రూ.70, చింతపండు రూ.120.

పక్కాగా డిజిటల్ కార్డు సర్వే చేపట్టాలి: కలెక్టర్

నారాయణపేట, న్యూస్‌టుడే : పకడ్బందీగా కుటుంబ డిజిటల్‌కార్డు సర్వే చేపట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం పలు అంశాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులతో దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. 3న డిజిటల్ కార్డు ప్రక్రియను సీఎం ప్రారంభిస్తారని, 8 వరకు వివరాలు సేకరిస్తామన్నారు. సర్వే వివరాలను ఎప్పటి కప్పుడు కంప్యూటర్‌లో నమోదుచేయాలన్నారు. అవసరమైన బృందాలను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో శిక్షణ కలెక్టర్ గరిమా నరుల, ఆర్డీవో మధుమోహన్, డీపీఓ కృష్ణ, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

పైలెట్ ప్రాజెక్టుకు ఎంపికైన గ్రామాలు

నియోజకవర్గం	మండలం	గ్రామం
నారాయణపేట	దామరగిద్ద	అయ్యవారిపల్లి
మక్తల్	ఊట్కూరు	కొత్తపల్లి
కొడంగల్	కోస్గి	ముక్తిపాడు

మరికల్‌లో స్వచ్ఛతా ర్యాలీ

మరికల్ కూడలి, న్యూస్‌టుడే : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మరికల్‌లో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శిక్షణ కలెక్టర్ గరిమ నరుల జెండా ఊపి ప్రారంభించారు. మాద్వార్ రోడ్డు, పాతబస్టాండ్, తహసీల్దారు కార్యాలయం మీదుగా జడ్పీహెచ్ఎస్ వరకు ర్యాలీ కొనసాగింది. శిక్షణ కలెక్టర్ మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులను దూరంగా ఉంచొచ్చన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఇందులో మహిళలతో పాటు శిక్షణ కలెక్టర్ బతుకమ్మ ఆడారు. తహసీల్దారు జమీల్, ఎంపీడీవో కొండన్న, ఎంఈవో పావని, పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి, అధికారులు, నాయకులు హరీశ్ కుమార్, వేణుగోపాల్, రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.


ర్యాలీలో శిక్షణ కలెక్టర్ గరిమ నరుల

మంచినీటి సరఫరా సహాయకులకు శిక్షణ

ఊట్కూరు, న్యూస్‌టుడే : మండల పరిషత్తు కార్యాలయం వద్ద మంగళవారం మిషన్ భగీరథ ఆధ్వర్యంలో గ్రామీణ నీటి సరఫరా సహాయకులకు శిక్షణ నిర్వహించారు. ప్రత్యేకాధికారి ఉమాపతి మాట్లాడుతూ పరిశుభ్రమైన నీటిని సరఫరా చేసి, ప్రజలకు సేవలు అందించాలన్నారు. ఎంపీడీవో ధనుంజయ గౌడ్, ఎంపీవో లక్ష్మీనారాయణ రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా పోలీసు చట్టం అమలు

నారాయణపేట, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా పోలీసు చట్టం అమలు చేస్తున్నట్లు ఎస్పీ యోగేశ్‌గౌతం తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, బహిరంగసభలు, కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. సామాజిక మాధ్యమాల్లో అనుమతి లేని పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రజాజీవనానికి, శాంతిభద్రతల విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

రెజ్లింగ్ క్రీడాకారిణికి సన్మానం

ధన్వాడ, న్యూస్‌టుడే : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల రెజ్లింగ్ క్రీడాకారిణి రజితను జిల్లా ఇంటర్ విద్యాధికారి సుదర్శన్‌రావు మంగళవారం సన్మానించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సంబంధించిన విద్యార్థిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విషయాన్ని అధ్యాపకుల ద్వారా తెలుసుకున్నారు. అభినందిస్తూ శాలువా కప్పి రజితను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమెను మిగతా విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో రాణించాలని కోరారు. ప్రిన్సిపల్ అబ్దుల్ ముజీబ్, అధ్యాపకులు పాల్గొన్నారు.


రజితను అభినందిస్తున్న సుదర్శన్‌రావు తదితరులు

ప్రైవేటు ఆసుపత్రి నిర్వాహకుడికి తాఖీదు

మరికల్ కూడలి, న్యూస్‌టుడే : మండలంలోని ప్రైవేటు ఆసుపత్రి నిర్వాహకుడికి డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి మంగళవారం తాఖీదులు జారీ చేశారు. ఉదయం ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేయగా పలు లోపాలు బయటపడ్డాయి. రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఆసుపత్రి లేకుండా స్కానింగ్ సెంటర్ నిర్వహించడం, ఓపీ, ఐపీ, కేస్ షీట్లు అసంపూర్తిగా ఉన్న విషయాన్ని గుర్తించారు. ధరలు, వైద్యుల పేర్లు, అను పత్రి సమయాలు ప్రదర్శించకపోవడంతో తాఖీదులు ఇచ్చారు. అనుమతులు లేకుండా వైద్యం నిర్వహించకూడదని తప్పుబట్టారు. ప్రజారోగ్య విషయంలో తేడాలొస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.


మరికల్‌లో ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి


పేట: ఎమ్మెల్యేతో ప్రిన్సిపల్, అధ్యాపకులు, సిబ్బంది


కోస్గి న్యూటౌన్: ముదిరెడ్డిపల్లిలో బతుకమ్మల నిమజ్జనం


మక్తల్: పాఠశాలలో బతుకమ్మ వేడుకలు


కాచ్‌వార్‌లో బాలబాలికల సందడి

పూల హొయలు.. పాటకు లయలు

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపల్ మెర్సీ వసంత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతితో మనిషి మమేకం కావాలన్న సందేశాన్ని ఈ పండగ ఇస్తుందన్నారు. తాను ఇప్పటికీ చదువుతూ ఉంటానని, వైద్యురాలిని కావాలన్న తన తండ్రి కలలను నిజం చేశానని చెబుతూ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. కార్యక్రమంలో పుర ఛైర్‌పర్సన్ గందె అనసూయ, వైస్ ఛైర్‌పర్సన్ హరినారాయణ భట్టడ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సదాశివారెడ్డి, వైస్ ఛైర్మన్ హన్మంతు, కౌన్సిలర్లు శిరీష, సలీం, మహేశ్ కుమార్ పాల్గొన్నారు.


మరికల్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు

ధన్వాడ, మరికల్, న్యూస్‌టుడే : ధన్వాడ బాలికల ఉన్నత పాఠశాల, సంత బజార్ ప్రాథమిక పాఠశాలతో పాటు కొండాపూర్, కిష్టాపూర్, చర్లపల్లి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో వేడుకల్ని నిర్వహించారు. రంగు రంగుల పూలతో బతుకమ్మలను తయారు చేశారు. వాటి చుట్టు చేరి బతుకమ్మ పాటలకు అనుగుణంగా పాదం కదిపారు. ముగింపులో ఊరేగింపుగా సమీపంలోని బావులు, చెరువుల వద్దకు బతుకమ్మలను తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.


మద్దూరు: నిడ్జింతలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు


ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాలలో పూల అలంకరణ


కోస్గి: మీర్జాపూర్‌లో విద్యార్థులతో ఉపాధ్యాయులు


దామరగిద్ద: కాన్‌కుర్తి ఉన్నత పాఠశాలలో ఉత్సవ శోభ


బిజ్వార్ పాఠశాలలో పూల అలంకరణలు తీసుకొస్తూ..

శరన్నవరాత్రులకు సర్వం సన్నద్ధం

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : శరన్నవరాత్రులకు పేటలోని శక్తిపీఠం సిద్ధమయ్యింది. శాంతానంద పురోహిత్ ఆధ్వర్యంలో ముస్తాబు చేశారు. చౌక్‌బజార్ ఉత్సవ కమిటీ, ఎస్ఎస్‌కే సమాజ్ మడి శివాలయం, బాపునగర్ ప్రధాన కూడళ్లలో దసరా పండగకు ఏర్పాటు చేయనున్నారు. ఈ ఏడాది కొత్తగా మోనప్పగుట్ట, సుభాష్ రోడ్డు, రజక సంఘం, పళ్ల ఎస్సీ వాడ, తిరుమలగుట్ట వెంకటేశ్వర స్వామి దేవాలయం బహార్‌పేట్, బురుదువాడీ, థండర్‌బాయ్స్, పళ్ల హనుమాన్ దేవాలయం, బ్రహ్మణవాడీ, అశోక్‌నగర్‌లో మండపాలను ఏర్పాటు చేసి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు.



సరాఫ్‌బజార్, ఎస్ఎస్‌కే సమాజ్ మడిలో విగ్రహాలు



విద్యుత్తు కాంతులతో ముస్తాబైన సరాఫ్ బజార్

50 మందికి కంటి వైద్య పరీక్షలు

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : మక్తల్ లయన్స్‌క్లబ్, ఎనుగొండ రాంరెడ్డి కంటి ఆసుపత్రి సౌజన్యంతో మంగళవారం మక్తల్ లయన్స్‌క్లబ్ భవనం వద్ద నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. 50మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 30మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరం అని గుర్తించి వారిని ఎనుగొండ రాంరెడ్డి కంటి ఆసుపత్రికి తరలించారు. మాజీ మంత్రి ఎల్లారెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. క్లబ్ అధ్యక్షుడు డీవీచారి, అనుగొండ శ్రీనివాసులు, అంజన్‌ప్రసాద్, కట్ట వెంకటేష్, వాధిరాజ్, మామిళ్ల పృథ్వి, కంటి వైద్యులు ప్రమోద్ పాల్గొన్నారు.

మాణిక్యగిరిపై ఆధ్యాత్మిక శోభ

రేపటి నుంచి 12 వరకు ఉత్సవాలు

దామరగిద్ద, న్యూస్‌టుడే : జిల్లా సరిహద్దున కర్ణాటకలోని యానగుంది మాణిక్యగిరి క్షేత్రంలో దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయ సముదాయంలోని వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకూ రంగం సిద్ధం చేశారు. బుధవారం అమావాస్య రోజున నారాయణపేట సాయి విజయకాలనీలోని మందార్ ఇంటి నుంచి వెంకటేశ్వరస్వామి వెండి ఉత్సవమూర్తిని ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగిస్తారు. భజనలు, సంకీర్తనలతో చౌక్‌బజార్, సుభాష్‌రోడ్డు, మద్దెల్ బీడ్, దామరగిద్ద, గడిమున్‌కన్‌పల్లి, కాన్‌కుర్తి, మీదుగా యానగుంది క్షేత్రానికి ఊరేగింపు చేరుకుంటుంది. దారిపొడవునా ప్రత్యేక పూజలు, తీర్థ ప్రసాదాల వితరణ చేస్తారు. ఉత్సవాల సందర్భంగా మాణిక్యగిరి క్షేత్రంలోని లక్ష్మీవెంకటేశ్వర, భవానీమాత ఆలయాలతో పాటు శివాలయం, పార్వతి, సరస్వతి, బ్రహ్మ, వీరబ్రహ్మేంద్ర, సిద్ధేశ్వర, అంజనేయ ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతాయి. మాణికేశ్వరి మాత దివ్య సమాధిని భక్తులు దర్శించుకుంటారు. ఈ ఉత్సవాలకు మన రాష్ట్రంతోపాటు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటకలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు వస్తారు. ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి.


మాణిక్యగిరి క్షేత్రంలో ఆలయ సముదాయం

భవానీమాత నవరాత్రులు : ఆలయ సముదాయంలోని భవానీమాత నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తారు ఘటస్థాపన, అకురార్పణ, నందదీపం, యజ్ఞం, అభిషేకం, అలంకరణ, సహస్రనామ కుంకుమార్చన, చండీ పారాయణం, హారతి, మంత్రపుష్పం వంటి కార్యక్రమాలు కొనసాగుతాయి.

విజయదశమి రోజున.. : బ్రహ్మోత్సవాల్లో భాగంగా విజయదశమి రోజు సాయంత్రం 5 గంటలకు పల్లకీ సేవ, శమీపూజ అనంతరం స్వాములవారి రథోత్సవం కన్నుల పండువగా జరగనుంది. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ట్రస్టు కార్యదర్శి శివయ్యస్వామి చెప్పారు.

ఎల్కోటి సేవలు ఎనలేనివి: వాకిటి


ఎల్కోటి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, నాయకులు

ఊట్కూరు, న్యూస్‌టుడే : మాజీ మంత్రి ఎల్కోటి ఎల్లారెడ్డి సేవలు ఎనలేనివని, ఆయన చేపట్టిన అభివృద్ధి ఎప్పటికీ గుర్తుండిపోతుందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఊట్కూరులో మంగళవారం దివంగత ఎల్లారెడ్డి జయంతి కార్యక్రమంలో నివాళి అర్పించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు, మిఠాయిలు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. పీఏసీఎస్ ఛైర్మన్ ఎం.బాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు సి.సూర్యప్రకాశ్‌రెడ్డి, ఎస్.అరవింద్ కుమార్, మాజీ విండో ఛైర్మన్ వై.నారాయణ రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వై.జనార్దన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శివరామరాజు, నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగంలో పలు మార్పులు

మక్తల్, న్యూస్‌టుడే : విద్యారంగంలో సమూల మార్పులు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో పదోన్నతులు పొందిన ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి పాఠశాలకు వాచ్‌మెన్, అటెండర్ నియామకంతోపాటు మరుగుదొడ్ల సౌకర్యాన్ని కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతి మండలంలో కేజీ నుంచి పీజీ వరకు విద్యనందించే విద్యాలయాలను ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. అందులో క్రీడా మైదానాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో అనిల్‌గౌడ్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, గురురాజారావు, విధూర్‌కుమార్, తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, గోలపల్లి నారాయణ పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీం పోలీసులు

అపరిచితులతో అప్రమత్తం సుమా!

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : మహిళలు, విద్యార్థినులు అపరిచిత వ్యక్తులపట్ల అప్రమత్తంగా ఉండాలని షీ టీం పోలీసులు అన్నారు. మంగళవారం పేట బ్రిలియంట్ పాఠశాలలో విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, మొబైల్ వినియోగం వల్ల అనర్థాల గురించి వివరించారు. అమ్మాయిలు వేధింపులకు గురైతే ఏం చేయాలో అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, ట్రాఫిక్ చట్టాల గురించి తెలియజేశారు. వేధింపులు ఎదురైతే 98126 70398 లేదా డయల్ 100ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బాలరాజు, చెన్నయ్య, ఉపాధ్యాయులు రాజేష్ పాల్గొన్నారు.

నేడు మహాత్మా గాంధీ విగ్రహావిష్కరణ

ఊట్కూరు, న్యూస్‌టుడే : మండలకేంద్రంలోని గాంధీనగర్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరు కానున్నారని నిర్వాహకులు తెలిపారు.

స్వచ్ఛందంగా గుంతల పూడ్చివేత

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఖానాపూర్ నుంచి అనుగొండకు వెళ్లే రహదారిలో దాతలు, టిప్పర్ యజమానులు మాట్లాడుకొని మట్టివేసి స్వచ్ఛందంగా రహదారిపై గుంతలు పూడ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్ని వరకు బీటీ రోడ్డుపై పెద్ద గోతులు పడి వాహనదారులు కిందపడి గాయపడుతున్నారన్నారు. ఈ విషయం పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. చిట్యాల గ్రామస్థులు టిప్పర్ యజమానులతో మాట్లాడి స్వచ్ఛందంగా గోతులు పూడ్చివేసినట్లు తెలిపారు.

పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచాలి

ఊట్కూరు, న్యూస్‌టుడే : గర్భిణులకు అవగాహన కల్పించి పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డా.సాయిరాం సూచించారు. ఊట్కూరు పీహెచ్‌సీలో మంగళవారం వైద్య సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడేపై అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యురాలు డా.భవాని, ఆరోగ్య విస్తరణాధికారి విజయ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవ్వ తాతలను సన్మానించి పూలను అందిస్తున్న విద్యార్థినులు

ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : వృద్ధులను ఇంట్లో వారే కాకుండా సమాజంలో అందరూ ఆదరించాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల జీహెచ్ఎం వేణుగోపాల్ అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వినూతన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల అవ్వ, తాతలను పాఠశాలలకు పిలిపించి సన్మానించి, గులాబీ పూలను అందించారు. అవ్వ, తాతలతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. కుటుంబ వ్యవస్థకు వారే సజీవ మూలాలు, నేటి పిల్లలు, యువతకు మార్గదర్శకులన్నారు. వృద్ధులతో ప్రేమగా మాట్లాడేందుకు కొంత సమయం కేటాయించాలన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు కోస్గి విద్యార్థులు

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే : జిల్లా షూటింగ్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల మక్తల్ మినీస్టేడియంలో నిర్వహించిన జిల్లా షూటింగ్‌బాల్ ఎంపికలలో కోస్గి మండలం ముశ్రీఫా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జగదీశ్వర్, కవితలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని సంఘం ప్రధాన కార్యదర్శి బి.గోపాలం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మంగళవారం పాఠశాల ఆవరణలో పతకాలు ప్రదానం చేశారు. జీహెచ్ఎం శేఖరయ్య, పీడీ పుష్పలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పతకాలు ప్రదానం చేస్తున్న జిల్లా షూటింగ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి బి.గోపాలం, జీహెచ్ఎం శేఖరయ్య తదితరులు

ముగ్గురు సైబర్ నేరగాళ్ల అరెస్టు


వివరాలను వెల్లడిస్తున్న సైబర్ క్రైమ్ డీఎస్పీ రత్నం

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే: యాప్‌ల ద్వారా రుణాలు మంజూరు చేస్తామని అమాయకుల్ని నమ్మించి డబ్బు వసూలు చేసి సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముగ్గురిని వనపర్తి జిల్లా కొత్తకోట పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. సైబర్ క్రైం డీఎస్పీ ఎన్‌బీ రత్నం, సీఐ రాంబాబుతో కలిసి వివరాలు వెల్లడించారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పిల్లిగుండు తండాకు చెందిన దినేశ్.. ఎర్రగుట్టతండాకు చెందిన చిట్కు రమేశ్ ద్వారా పశ్చిమబెంగాల్‌లో సైబర్ నేరాలు ఎలా చేయాలో శిక్షణ పొందాడు. అక్కడే కొన్ని రోజులు వారిచ్చిన జాబితాలో ఉన్న చరవాణులకు ఫోన్ చేసి రుణాలకు దరఖాస్తు చేసుకున్నారని, దానికి రుసుము చెల్లించాల్సి ఉంటుందని నమ్మించి వారి దగ్గర నుంచి రూ.10-40 వేలు వసూలు చేసేవాడు. అక్కడి నుంచి తండాకు వచ్చిన దినేశ్ సైబర్ నేరాలకు ఎలా పాల్పడాలో ఆయన సోదరుడు నరేశ్, స్నేహితుడు విజయ్‌కి కూడా శిక్షణ ఇచ్చారు. కొత్తకోటకు చెందిన కుమ్మరి రాజు రుణానికి దరఖాస్తు చేసుకోగా జులైలో వీళ్లు ఆయనకు ఫోన్ చేసి రుణాన్ని మంజూరు చేసేందుకు ఛార్జీలు చెల్లించాలని చెప్పారు. రెండు విడతల్లో రూ.12,250 చెల్లించారు. మరో రూ.9 వేలు చెల్లించాలని చెప్పడంతో మోసపోయానని గుర్తించి వెంటనే కొత్తకోట ఠాణాలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన పోలీసులు దినేశ్, నరేశ్, విజయ్‌లను అదుపులోకి తీసుకొని విచారించారు. వారి నుంచి ప్లాట్, భూమి పత్రాలు, 9 చరవాణులు, 5 సిమ్‌కార్డులు, రెండు కార్లు, ఒక బుల్లెట్ మొత్తం రూ.50 లక్షల విలువైన వాటిని జప్తు చేసినట్లు వివరించారు. కేసు దర్యాప్తులో ఎస్సై మంజునాథరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ కురమయ్య, కానిస్టేబుల్ వెంకటేశ్వర్‌రెడ్డి చురుగ్గా వ్యవహరించారన్నారు. నిందితులను రిమాండుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఇప్పటి వరకు ఈ కేసులో సంబంధం ఉన్న 13 మందిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నర్వ, న్యూస్‌టుడే : భార్య కాపురానికి రాలేదని కలత చెందిన వ్యక్తి పురుగు మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై కురుమయ్య తెలిపారు. ఎల్లంపల్లికి చెందిన అపంపల్లి రఘు (34)కు భార్యతో ఇరవై రోజుల కిందట గొడవ జరిగింది. ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. కలత చెందిన రఘు గతనెల 24న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందును తాగాడు. వైద్యం కోసం అతనిని హైదరాబాద్ తీసుకెళ్లగా ఈనెల 30న అర్ధరాత్రి మృతిచెందినట్లు పోలీసులు వెల్లడించారు.

మంత్రిని కలిసిన బీసీసంఘం నాయకులు

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో బీసీ భవనాలు నిర్మించాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందించినట్లు బీసీ ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి రామాంజనేయులుగౌడ్ తెలిపారు. బీసీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం 3 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించాలన్నారు. కుల గణన చేపట్టిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరినట్లు తెలిపారు. బీసీ సేన రాష్ట్ర నాయకులు గయప్పయాదవ్, రాజు, లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సెలవులకు ప్రత్యేక బస్సులు

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : దసరా పండగ సెలవులను పురస్కరించుకుని నారాయణపేట నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. రెండోతేదీ నుంచి 11వరకు, 13 నుంచి 15 వరకు ఈ ప్రత్యేక సర్వీసులు ఉంటాయన్నారు.. ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిమాండ్లు పరిష్కరించకపోతే ఉద్యమం

మరికల్ కూడలి, న్యూస్‌టుడే : ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమానికి వెనుకాబోమని తెలంగాణ విద్యుత్తు ఉద్యోగుల సంఘం (1104) రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. ఉద్యోగి శ్రీనివాస్ పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం మరికల్ వచ్చిన ఆయన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబాతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు విద్యుత్‌కు సంబంధించిన ఆస్తులను వాటాల రూపంలో పంచుకున్నాయి. కానీ కార్మిక చట్టాలు, సమస్యల గురించి పట్టించుకోలేదన్నారు. గత మార్చి ఒకటో తేదీన 50 డిమాండ్లతో కూడిన వినతిని యజమాన్యానికి అందజేసినా ఫలితం లేదన్నారు. సాయిబాబా మాట్లాడుతూ ఆర్టిజన్లు వివక్షతకు గురవుతున్నారని వీరి సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలన్నారు. 3న పాల్వంచలో ప్రత్యేకంగా వారి సమస్యల పరిష్కారం కోసం సదస్సు నిర్వహిస్తున్నామని, ఇందులో ఎమ్మెల్యే కూనం సాంబశివరావు పాల్గొనబోతున్నారని అన్నారు. మహబూబ్‌నగర్, నారాయణపేట నాయకులు మోగులప్ప, యాదయ్యగౌడ్, శ్రీదర్‌రెడ్డి, రవీంద్రాచారి, గోవిందురాజు,మల్లికార్జున్, స్వామి, పాండునాయక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు